క్లుప్తంగా

సప్త గోదావరిలోకి జలాలు


సప్త గోదావరిలో జలాలు నింపే ప్రక్రియను ప్రారంభిస్తున్న ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరిలోకి గోదావరి జలాలు నింపే ప్రక్రియను గురువారం పూజలు చేసి ప్రారంభించారు. సప్త గోదావరిలో కొత్త నీటిని నింపడం కోసం చెరువులో నీటిని పూర్తిగా తొలగించారు. గురువారం ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించిన అనంతరం వెంకటాయపాలెం కాలువ నుంచి పైపులైన్ ద్వారా గోదావరి జలాలతో నింపే ప్రకియను ప్రారంభించారు. వీఆర్ఓ కాకినాడ సాయిబాబు, ఆలయ అర్చకుడు కళ్లేపల్లి విస్సు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త కలెక్టర్‌ను కలిసిన చాంబర్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా నూతన కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆర్.మహేష్‌కుమార్‌ను ది అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు స్థానిక కలెక్టరేట్‌లో కొత్త కలెక్టర్‌ను కలిసి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, కట్టోజు సన్యాసి దాసు, కుప్పాల రామకృష్ణ, యర్రా సతీష్, దండుమేను రూపేష్, అడపా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

అమలాపురం రూరల్: నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రావిలాల మహేష్‌కుమార్‌ను గురువారం రాత్రి జిల్లా ఎస్పీ శ్రీధర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

చెల్లింపు.. మళ్లింపు

- ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంల్లో విద్యుత్ చెల్లింపులు బంద్
- ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లులు కట్టేందుకు అవకాశం
- అందుబాటులోకి మొబైల్ యాప్
- డివిజన్ పరిధిలో 1.97 లక్షల విద్యుత్ కనెక్షన్లు


అంగరలో విద్యుత్ సబ్ స్టేషన్

రాయవరం/కపిలేశ్వరపురం: విద్యుత్ వినియోగదారులు నెలవారీ బిల్లుల చెల్లింపుల విధానంలో ఈపీడీసీఎల్ మార్పులు చేపట్టింది. ఇప్పటి వరకు యూపీఐ యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు జరగ్గా, ఇప్పుడు రిజర్వు బ్యాంక్ ఆదేశాలతో ఈ విధానంలో మార్పులు చేపట్టారు. గతంలో థర్డ్ పార్టీ యాప్‌లైన ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా నేరుగా విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. ఆర్‌బీఐ కొత్త నిబంధనల నేపథ్యంలో ఇకపై ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుంది.

ఇప్పటి వరకు ఇలా..

ఇప్పటి వరకు విద్యుత్ వినియోగదారుల్లో కొంత మంది బిల్లులను విద్యుత్ కార్యాలయాల్లో రెవెన్యూ కౌంటర్ల వద్ద చెల్లిస్తున్నారు. మరికొందరు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా కడుతున్నారు. అత్యధిక వినియోగదారులు మాత్రం గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ఇతర యూపీఐ యాప్‌లను వినియోగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ యాప్‌ల ద్వారా చెల్లింపుల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. సాధారణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు నిర్దేశిత గడువు తర్వాత కూడా యాప్‌లో చెల్లించే అవకాశం ఉంటుంది. ఇకపై ఇలా చేయడం కుదరదని విద్యుత్ అధికారులు తెలిపారు. ఆర్బీఐ భారత్ బిల్ పేమెంట్స్ మార్గదర్శకాల ప్రకారం నేరుగా యాప్ నుంచి చెల్లింపులను నిలిపివేశారు.

స్పష్టమైన ఆదేశాలు

ఆర్‌బీఐ మార్గదర్శకాలు మేరకు చెల్లింపు విధానంలో మార్పు చోటు చేసుకున్నట్టు సంస్థ తెలిపింది. ఇక మీదట ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్ ద్వారా బిల్లులు చెల్లించేటప్పుడు ఈపీడీసీఎల్ పేరు కనిపించదు. తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ, పశ్చిమ గోదావరి, భీమవరం, ఏలూరు జిల్లాలతో పాటు ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. లేదా సంస్థ వెబ్‌సైట్ www.apeasternpower.com ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. ఈపీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు, డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్ కార్డులను కూడా వినియోగించవచ్చు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఈఈ వై.వి జయానంద్ తెలిపారు.

సెక్షన్ల వారీగా విద్యుత్ కనెక్షన్లు ఇలా..

సెక్షన్	కేటగిరి1	కేటగిరి2	కేటగిరి3	కేటగిరి4	కేటగిరి5	మొత్తం
రామచంద్రపురం టౌన్	19105	2762	87	531	436	22921
రామచంద్రపురం రూరల్	18084	2062	59	567	704	21476
పామర్రు	17607	1439	33	681	448	20208
కపిలేశ్వరపురం	20021	1394	39	588	936	22978
మండపేట	22274	4151	82	308	171	26986
ఏడిద	7023	646	38	146	740	8593
ఆలమూరు	23230	2293	72	528	1834	27957
ద్వారపూడి	18271	2070	115	416	797	21669
రాయవరం	21750	1920	84	551	868	25173

డివిజన్‌లో ఇదీ పరిస్థితి

రామచంద్రపురం డివిజన్ పరిధిలో రామచంద్రపురం, మండపేట సబ్ డివిజన్లు ఉన్నాయి. మండపేట సబ్ డివిజన్‌లో మండపేట, ఆలమూరు, ఏడిద, రాయవరం, ద్వారపూడి సెక్షన్లు, రామచంద్రపురం సబ్ డివిజన్‌లో రామచంద్రపురం టౌన్, రామచంద్రపురం రూరల్, కపిలేశ్వరపురం, పామర్రు సెక్షన్లు ఉన్నాయి. డివిజన్ పరిధిలో కేటగిరి-1, కేటగిరి-2, కేటగిరి-3, కేటగిరి-4, కేటగిరి-5గా 1,97,961 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. రామచంద్రపురం సబ్ డివిజన్‌లో 87,583 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, మండపేట సబ్ డివిజన్‌లో 1,10,378 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆయా కనెక్షన్ల ద్వారా ప్రతి నెలా వినియోగదారులు రూ.17 కోట్ల విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నారు.

డౌన్‌లోడ్ చేసుకోవాలి



విద్యుత్ బిల్లుల చెల్లింపులో వినియోగదారులు మారిన నిబంధనలను పాటించాలి. వినియోగదారులు వెబ్‌సైట్ ద్వారా లేదా యాప్ ద్వారా మాత్రమే చెల్లింపులు చేయాలి. గడువులోగా బిల్లుల చెల్లింపులు చేపట్టాలి. బిల్లుల చెల్లింపులో విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

– వై.విజయానంద్, ఈఈ, ఈపీడీసీఎల్, రామచంద్రపురం డివిజన్

మాస శివరాత్రి పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో గురువారం 245వ మాస శివరాత్రి పూజను వైభవంగా నిర్వహించారు. స్థానిక బసవేశ్వరస్వామి ఆలయంలో నిర్వహణా కమిటీ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు.

అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభించాలి

మండపేట: పట్టణంలో ఎన్నికల సందర్భంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో ఆమె కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ పలు వార్డుల్లో టెండర్లు ఖరారైన అభివృద్ధి పనులను వెంటనే మొదలెట్టాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్‌తో ఇప్పుడు ఎటువంటి ఆటంకం లేదని చెప్పారు. వైస్ చైర్మన్ వేగుళ్ల నారాయణరావు, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, గ్రంధి శ్రీనివాస్, డీఈఈ కే శ్రీనివాస్, ఏఈలు కే సత్యనారాయణ, పవన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు యర్రగుంట అయ్యప్ప, జొన్నపల్లి సత్తిబాబు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలపై 7న శిక్షణ

రామచంద్రపురం: పదో తరగతికి కొత్తగా వచ్చిన భౌతిక, రసాయన శాస్త్ర పాఠ్య పుస్తకంపై సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని రామచంద్రపురంలో ఈ నెల 7న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి, ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. పాఠ్య పుస్తకంలోని పాఠ్యాంశాలపై అవగాహన, తరగతి గదిలో ప్రయోగ పూర్వక బోధన వంటి అంశాలపై ఒకరోజు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల ఉపాధ్యాయులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పాల్గొనడానికి ఎటువంటి రుసుం లేదని, పూర్తి వివరాలకు 98661 30320 నంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

రైతులకు ప్రయోజనం కలిగే పనులు చేయండి

సాక్షి, అమలాపురం: నియోజకవర్గ పరిధిలో రైతులకు ప్రయోజనం కలిగించే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కోరారు. క్యాంపు కార్యాలయంలో గురువారం వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్, డ్రెయిన్స్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌కు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేయడం, కాలువల మరమ్మతు పనులు చేపట్టడంపై ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి

మండపేట: వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. గురువారం వార్డు కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, గ్రంధి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నపల్లి సత్తిబాబు, యర్ర గుంట అయ్యప్పతో కలిసి ఆమె గొల్లపుంత రోడ్డులో ఉన్న టిడ్కో కాలనీని సందర్శించారు. కాలనీలోని రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిపోయిన పిచ్చి గడ్డిని, మొక్కలను తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యకు సూచించారు.

అనంతరం ఏడో వార్డులో ఉన్న శ్మశాన వాటికను పరిశీలించారు. శ్మశాన స్థలంలో ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించాలని కమిషనర్ బి.రాముకు చెప్పారు.


టిడ్కో కాలనీలో పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

మాజీ మంత్రి వేణుకు పరామర్శ

మండపేట: మాతృ వియోగంతో బాధ పడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను మండపేట వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. రామచంద్రపురంలోని ఆయన నివాసానికి వెళ్లి, సుభద్రమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్ల సంఘ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ(రాజబాబు), ప్రముఖ పారిశ్రామికవేత్త వేగుళ్ల వీరవెంకట సత్యనారాయణ చౌదరి(మాధవిబాబు), రైతు విభాగం నాయకుడు కొవ్వూరి త్రినాథరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, సొసైటీ మాజీ చైర్మన్ పెంకే గంగాధర్, నాయకులు సాధనాల శివ భగవాన్, కాద శ్రీనుబాబు తదితరులు ఉన్నారు.


వేణు తల్లి సుభద్రమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మండపేట వైఎస్సార్ సీపీ నేతలు

అల్లూరి జీవితం ఆదర్శప్రాయం


ద్వారపూడిలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు


అంగరలో అల్లూరి విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: నేటి యువతకు స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలు తెలిపారు. మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం గ్రామాల్లో బుధవారం అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. అంగరలో అల్లూరి విగ్రహానికి ఎస్సై అందె పరదేశి, పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్న కుమారి, అల్లూరి యువజన సంఘం నాయకులు సతీష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పిల్లా బసవరాజు, డాక్టర్ త్రిమూర్తులు, కంకటాల నాగు, ఉండమట్ల వెంకటేశ్వరరావు, అంగర, పడమ ఖండ్రిక గ్రామస్తులు పాల్గొన్నారు.

మండపేట: వాడవాడలా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ద్వారపూడి, ఏడిద సీతానగరంతో పాటు, మున్సిపల్ కార్యాలయంలో కూడా నిర్వహించారు. కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ దుర్గారాణి మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ మేనేజర్ కనకరాజు, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు యర్రగుంట అయ్యప్ప, జొన్నపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం కోదండరామ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు జరిగాయి. ద్వారపూడిలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో సమితి సభ్యుడు గూడూరి సబ్బరాజు నేతృత్వంలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ ప్రెసిడెంటు దంతులూరి శ్రీరామవర్మ, ఉప సర్పంచ్ తులా శేషారావు పంచాయతీ సమీపంలో ఉన్న అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు.

నీట్‌ను రద్దు చేయాలని ఆందోళన

- రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించాలి
- విద్యార్థి సంఘాల డిమాండ్


రామచంద్రపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు


కె.గంగవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

రామచంద్రపురం: నీట్‌ను రద్దు చేయాలని గురువారం దేశవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ రామచంద్రపురంలో విజయవంతమైంది. పీవైఎల్ జిల్లా నాయకుడు వి.భీమశంకరం, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు ప్రశాంత్, కరుణాకర్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ చేశారని బహిరంగంగా చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయాలని అన్నారు. నీట్- నెట్ పరీక్షను నిర్వహించిన ఎన్‌టీఏ సంస్థను తక్షణమే రద్దు చేయాలని, నీట్ పరీక్షకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని అన్నారు. వైద్య విద్యతో వ్యాపారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోవాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు హరీష్, యశ్వంత్, వీరబాబు, సత్యసాయి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని పీవైఎల్ జిల్లా నాయకుడు వి.భీమశంకరం, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు ప్రశాంత్, కరుణాకర్ తదితరులు డిమాండ్ చేశారు. కె.గంగవరంలో గురువారం విద్యార్థులతో కలసి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో ఒక్కో విద్యార్థి నుంచి రూ. 30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసి పేపర్ లీక్ చేశారన్నారు. ఇంత జరిగినా కేంద్ర ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు నీట్ పరీక్షను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాయని, కానీ ఏపీ ప్రభుత్వం మాత్రం నీట్ పరీక్షపై ఏ మాత్రం మాట్లాడడం లేదని అన్నారు. వెంటనే ఏపీ ప్రభుత్వం కూడా నీట్ పరీక్షను రద్దు చేసి, కేంద్రంపై పోరాటం చేయాలన్నారు. దీనిపై మండలంలో బంద్ విజయవంతం అయ్యిందన్నారు. పీడీఎస్‌యూ నాయకులు హరీష్, యశ్వంత్, వీరబాబు, సత్యసాయి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

కపిలేశ్వరపురం: మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలోని జూనియర్ కళాశాల విద్యార్థులు బంద్‌ను పాటించారు. సంఘం పిలుపు మేరకు నిరసన తెలిపారు. సంఘం నాయకుడు బి.సిద్ధూ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు తెరిచి నెల పూర్తయినా రూ.20 వేల ఆర్థికసాయం అందివ్వకపోవడం సరికాదన్నారు.

ప్రజల మనిషి వంగవీటి


రామచంద్రపురంలో రంగాకు నివాళులర్పిస్తున్న నాయకులు


ద్రాక్షారామలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, కాపు నాయకులు


మండపేటలో రంగాకు నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, కాపు నాయకులు


అంగర గాంధీ సెంటర్‌లో రంగాకు నివాళులర్పిస్తున్న నాయకులు


సోమేశ్వరంలో రంగాకు నివాళులర్పిస్తున్న కాపు సంఘం నాయకులు


పడమర ఖండ్రికలో రంగా జయంతిలో లీలాకృష్ణ తదితరులు

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజల మనిషిగా వంగవీటి మోహనరంగా వెలుగొందారని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని అంగర, పడమర ఖండ్రిక, టేకి, కోరుమిల్లి, కేదారిలంక గ్రామాల్లో బుధవారం వంగవీటి మోహనరంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో పార్టీలకతీతంగా గ్రామస్తులు రంగాకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్, తాపీ మేస్త్రుల సంఘం నాయకులు పాల్గొన్నారు. పడమర ఖండ్రికలో రంగా విగ్రహం వద్ద రంగా జయంతి కార్యక్రమంలో జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ పాల్గొన్నారు.

సోమేశ్వరంలో..

రాయవరం: దివంగత కాపు నాయకుడు వంగవీటి మోహన్‌రంగా జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి కాపు సంఘం మండల శాఖ అధ్యక్షుడు నున్న వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక కాపు నేతలు గరగ శ్రీనివాసరావు, గరగ నానాజీ, శాకా చంద్రభగవాన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపు జాతికి రంగా తన జీవితాన్ని త్యాగం చేశారని నున్న వెంకటరమణ కొనియాడారు. కాపు నేతలు శాకా నాగేంద్ర, పులుం పెదకాపు, శాకా చిన్నబాబ్జి, పులుం అర్జునరావు, నాగదేవర అమ్మిరాజు, నున్న ఈశ్వరుడు, మాగాపు వీరబాబు, నాగదేవర సుబ్బారావు, కాపు యూత్ నాయకులు పాల్గొన్నారు.

పట్టణ, రూరల్‌లో..

మండపేట: దివంగత కాపు నేత వంగవీటి మోహన్ రంగా జయంతిని మండపేట పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఆయన అభిమానులు, కాపు నాయకులు, కాపు యువత, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వంగవీటి విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో కాపు అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు జిన్నూరి సత్యసాయిబాబా సారథ్యంలో రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. వాణీమహల్ జంక్షన్ వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నతుడు వంగవీటి మోహన రంగా అని కొనియాడారు. మండపేటలో రంగా విగ్రహం నెలకొల్పాలన్న కలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నెరవేర్చారన్నారు. కాపు సంఘం ప్రెసిడెంట్ సాయిబాబా, కాపు నాయకులు మెండు బాపిరాజు, గోకరకొండ భీమరాజు, అధికారి శ్రీనివాస్, సిద్ధిరెడ్డి సూర్యారావు, పేపర్తి సాంబు, కర్రి రామారావు తదితరులు పాల్గొన్నారు. వాణీమహల్ వద్ద రంగా విగ్రహానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నివాళులర్పించారు. ఏడిదలో రంగా విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో కాపు యువత, పెద్దలు, ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. ఉప సర్పంచ్ చంద్ర శ్రీనివాస్, వార్డు సభ్యులు వాసిరెడ్డి అర్జున్, అల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో వంగవీటి మోహనరంగా జయంతిని నిర్వహించారు. ద్రాక్షారామలో రంగా విగ్రహం వద్ద శాకా భద్రరావు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, పెమ్మిరెడ్డి దొరబాబు, అనిశెట్టి రామకృష్ణ, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, ఉప సర్పంచులు పెన్నాడ బుచ్చిరాజు, చల్లా బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు మాగాపు అమ్మిరాజు, కర్రి అబ్బు, పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: దివంగత వంగవీటి మోహనరంగా జయంతిని గురువారం పట్టణంలోని చప్పిడివారి సావరంలో నిర్వహించారు. రంగా విగ్రహం వద్ద పట్టణ కాపు సంఘం అధ్యక్షుడు నారపరెడ్డి బలరామ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, జనసేన నాయకుడు పోలిశెట్టి చంద్రశేఖర్ హాజరయ్యారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపు సంఘ గౌరవ అధ్యక్షుడు ఆరిగేలా నాగేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కనకాల వెంకటేశ్వరరావు, గాధంశెట్టి శ్రీధర్, కంచుమూర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.